# నీచాతి నీచుడు

అంత్యక్రియలకు వచ్చిన బంధువులూ, జ్ఞాతులూ అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ వంశానికంతటికీ మిగిలిన పండు ముసలమ్మ కాస్తా గుటుక్కుమనేసరికి—పుష్కరం, పదిహేనేళ్ళనుంచీ ఆ కుటుంబపు ముఖా ముఖం తెలియని వాళ్ళంతా పెద్ద దినానికి హాజరయ్యారు. కర్మ చేస్తున్నాయన పెద్ద వుద్యోగంలో వున్నవాడు గనక, వచ్చిన అయిదారొందలమందికీ ఏ లోటూ జరక్కుండా సరంజామా సరఫరా జేశారు. అందుకనే అందరూ తాపీగా కూచ్చుని మరీ తిట్టిపోశారు—పున్నయ్యని.

అలాంటివాణ్ణి తిట్టారూ అంటే-తిట్టరూ మరీ! "చెట్టంత ముసలమ్మ చచ్చిపోతే దినవారాలకైనా రాని మనుమ డెక్కడన్నా వుంటాడా? అందులోనూ స్వయానా నాయనమ్మయ్యె!! కర్మాదులు నిర్వర్తించవలసిన వొక్క కొడుకూ (తమ తండ్రి) ఏనాడోపోయె. ఇక తన అన్నా తనూ కలిసి చెయ్యక, మరెవరు చేస్తారనుకున్నాడో యీ కర్మకాండంతా?" అన్నారు కొందరు.

"ఈ పెద్దవాడు బుద్ధిమంతుడూ, వంశానికంతటికీ పేరు ప్రతిష్ఠలు తెచ్చేవాడు గనక సరిపోయిందిగాని - వీడూ పున్నడి లాంటివాడైతే ఆ ముసలమ్మని కాటికీడ్చేవాళ్ళు కూడా లేకపోయేదేగా?" .. "అరి దుర్మార్గుడా! ఇలాటి పుత్రులూ, పౌత్రులూ పుట్టేందుకు - భూదేవికి భారం కూడాను" అని నిర్ణయించారు మరి కొందరు.

"అన్నతోపాటు తనూ సగం ఖర్చు భరించవలసివస్తుందని మొఖం చాటేశాడేమో"నని ఒకాయనంటే; మరొకాయన "ఛా! వెధవ డబ్బుకోసం యింత నీచప్పని ఎవరన్నా చేస్తారా - థూ" అని వుమ్మేశాడు. ఒక ముట్టం "అయినా - వాణ్ణెఖర్చు భరించమని పెద్దవాడు అడుగుతాడా ఏమన్నానా? వాడికి నోట్లో నాలికే లేదయ్యో! కనీసం మొఖమన్నా చూపించి, మైలనీళ్ళు పోసుకుపోతే మాటదక్కేదిగా ఆ సన్నాశికి "అంటే; మరొకజ్ఞాతి"మంచి మాట దక్కించుకోవటం మాత్రం చేతయ్యెడవొద్దూ" అని దీర్ఘం తీశాడు.

ఇంతలో కర్మచేస్తున్న పెద్దబ్బాయటు రావడంతో ఒక ముసలాయన "అయితే - ఆపున్నడికి తెలుసటరా నాయనమ్మపోయిందనీ?" అని అడిగాడు. పెద్దబ్బాయి "ఎందుకు తెలవదూ? వాళ్ళత్తగారూరు వుత్తరం వేశాను. మొన్న మా సుబ్బయ్య మామ కనిపిస్తే ఆయన చెప్పాట్ట కూడాను ఫలానారోజు దినం అని" అని చెప్పాడు. ఒక మేనమామ "అసలు వాడెక్కడుంటున్నాడూ, ఏంచేస్తున్నాడూ?" అని పృచ్ఛించితే; "ఏమో! వాళ్ళత్తగారికి తెలుస్తుందిగాని - మనకెలా తెలుస్తుందీ? మనకేనా ఉన్నా ఏదన్నా చెప్పాడా పెట్టాడా? ఆఖరికి వుత్తరం ముక్క కూడా వెయ్యడంలేదు" అని పెద్దబ్బాయి చెప్పాడు. జనమంతా "ఛీ - వాడు మీ అమ్మకడుపు చెడబుట్టాడురా -! మనిషైనవాడు యిట్లా చేస్తాడా??" అని ఖండించి వూశారు - పున్నయ్య నుద్దేశించి.

ఇక ఆడంగుల తిట్లు యథాతథంగా వర్ణించనేలేం. 'తల్లి కూడు పెట్టని చచ్చినాడ'ని ఒకామె; 'అన్నమాట వినని రాలుగాయని' ఒకామె; 'పెళ్ళాం మాటలు విని, మాటలు తెచ్చి కులికేమనిషి - తల్లి సంగతి విచారించకుండావుంటే, కన్నతల్లి ఏమైపోతుం దనుకున్నాడో, వాడిజిమ్మడా' అని మరొకామె; 'అన్నీ అన్న భరిస్తున్నాడుగదా అని తప్పించుకు తిరుగుతున్నాడు -దొంగవెధవ' అని ఇంకొకామె తలా ఒక విధంగా దుమ్మెత్తిపోశారు.

"నాయనమ్మ చచ్చిపోయిందని తెలిసీ; మిగిలిన కుటుంబానికి పెద్దయిన అన్నగారింట జరుపవలసిన కర్మకలాపాలకు వెళ్ళని మనిషీ ఒక మనిషేనా-గడ్డితినే పశువుగాని" అని తిట్టనివాళ్ళు ఆ అయిదారొందలమందిలోనూ ఒక్కళ్ళుకూడా వుండరు - వుండరాదు.

* * *

ఇదంతా జరిగిన నెల్లాళ్ళకి ఆ నీచుడు పున్నయ్య - బెజవాడలో గంగయ్యక్కనిపించడం; అతడు చుట్టమేగాక ముఖ్యమిత్రుని వంటివాడు కావడంవల్ల పున్నయ్యకి తగిలే తిట్లూ, శాపనార్థాలన్నీ చెప్పి "ఇంత చదువుకున్నవాడివీ, యిట్లా నీచంగా ప్రవర్తించేవేరా?" "అని చీవాట్లు వేయడమూ జరిగాయ్. పున్నయ్య గావురుమని ఏడ్చి - ఆ నడిబజారులోనే - గంగయ్య కాళ్ళమీదపడి, తనవెంట తనుంటున్నా వూరురమ్మని బ్రదిమాలాడు.

గంగయ్య "అసలుసంగతేమిట్రా?" అంటే - "మా యింటికొస్తే అన్నీ చెబుతాన"న్నాడు పున్నయ్య. తప్పనిసరై గంగయ్య వాళ్ళూరు వెళ్ళేందుకు వప్పుకున్నాడు. పున్నయ్య బజారులో నాలుగైదు పలకలూ బలపాలూ కొనుక్కుని గంగయ్యను తీసుకుని తనుంటున్న గ్రామం తీసుకెళ్ళాడు. కారులో తన టికెట్టు కూడా గంగయ్యే కొంటూంటే చూచికూడా, ఏమీ ఎరగనట్లు ముఖం తిప్పుకూచున్నాడు. "వీడు నిజంగా పీనాశీ, కిలాడీ వెధవా అయిపోయాడ్రా!" అనుకున్నాడు గంగయ్య. అతడక్కడే కారుదిగి తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడుగాని- పున్నయ్యగాడింటికి వెళ్ళి సంగతులేమిటో పూర్తిగా చూచి, నాలుగూ దులిపితేనేగాని కసితీరదని అనుకోవడంవల్ల ఆగాడు.

ఈ యిద్దరూ కారుదిగి ఆ కుగ్రామంలో ప్రవేశించేసరికి మిట్టమధ్యాహ్నమయింది. బజారునే వెళుతూండగా ఒక వరండాలో కూచ్చుని చుట్ట చుట్టుకుంటున్న మీసాలాయన "ఏమయ్యోయ్, పంతులూ! పిల్లల్ని గాలికొదిలి బెజవాడెళ్ళావటయ్యా?" అని ఎగతాళీ, అహంకారయుతంగా అడిగాడు. పున్నయ్య "లేదు బాబూ! పలకలూ బలపాలూ తెమ్మంటే వెళ్ళాను. పిల్లల్ని మా యింటికాడే చదువుకుంటూండమని చెప్పి వెళ్ళాను" అని జవాబు చెప్పాడు. అతని ముఖంలో అప్పుడు కనిపించినంత భయం, వేదనా మరెన్నడూ గంగయ్య చూచి యెరుగడు. మీసాలాయన "నువ్వు దగ్గిరుండరపోతే పిల్లలు చదువుతారటయ్యా?" అని

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

నిగ్గదీశారు. పున్నయ్య "నాభార్య చదివిస్తూంటుందిలెండి బాబూ! మరి ఏం చెయ్యనూ? పలకలు లేకపోతే కోటయ్య బాబుగారికోప్పుకపంరాదూ!" అన్నాడు. మీసాలాయన "సరే...ఇక నెప్పుడు స్కూలికి నాగా పెట్టుకు"అని 'క్షమించేశాం పొమ్మ' న్నట్లు చూచాడు.

వాళ్ళిద్దరూ యింటికి చేసుకునే సరికి పున్నయ్య భార్య పదిమంది పిల్లల్ని "బాబులుగా...గల్లంతు చెయ్యకండి...మీకుదణ్ణం పెడతా, కూచ్చుని చదువుకోండి" అని బ్రతిమాలుతూంది. పిల్లలు బూరలూ, గోళీలతో గోలగోలగా ఆడుకుంటున్నారు. ఇలాగున్న పిల్లల్ని పున్నయ్య గనక నాలుగు బాదితే వాళ్లే చదువుకుంటారనుకున్నాడు గంగయ్య. కాని పున్నయ్య వాళ్ళనేమీ అనలేదు. పైగా "అబ్బాయిలూ - యిక గల్లంతు చెయ్యకండి...ఇవ్వాళ మీకు భలే గమ్మత్తు కథ చెపుతాను. "అని ఎంతో నమ్రతగా చెప్పాడు. పిల్లలందరూ కథ చెప్పండి మాష్టారూ"అని ఎగబడితే "గంటసేపు నిశ్శబ్దంగా కూచ్చుని చదివితే - అప్పుడు కథ చెబుతాను" అన్నాడు పున్నయ్య. పిల్లలంతా బుద్ధిమంతుల్లా కూచ్చుని చదువుకోసాగారు.

అతిథి మర్యాదలయ్యాక గంగయ్యే అడిగాడు "పిల్లలకే నువ్వు భయపడుతూంటే వాళ్ళకి చదువేం వస్తుందీ, నువ్వేం పంతులివీ?" అని. పున్నయ్య "ఏం చెయ్యను? వ్యక్తిగత స్వేచ్ఛకోసం పోరాడి పోరాడి అలసిపోయ్యాను. ఏ ఆస్తిపాస్తులూ లేనందువల్ల ఏదో ఒక వుద్యోగం చేసుకోక తప్పదు. పదిరకాల వుద్యోగాలుచేసి చూశాను - ఏ ఒక్క దాంట్లోనూ వ్యక్తిగత స్వేచ్ఛకు స్థానంలేదని తలకాయ గొట్టి మరీ చెప్పింది సంఘం. ఆఖరికి భార్యాబిడ్డలతోకలోగంజో తాగి బదికేందుకు దేవుళ్లాడక తప్పలేదు. బస్తీల్లోవుండి వంద సంపాదించే కంటే, గ్రామంలో ఏభైసంపాదించుకుంటే ఖులాసాగా గడిచిపోతుందని తెలుసుకుని యీ ప్రయివేటు పంతులు పనికొప్పుకొన్నాను. ముందు యిక్కడ నిలదొక్కుకో గలిగితే, మెల్లగా వ్యక్తిగత స్వేచ్ఛా,అభివృద్ధిసాధించుకోవచ్చును. ఇక్కడ నిలబడాలంటే పిల్లలతోనూ, పెద్దలతోనూ కూడా అడకువగావుండడం ముఖ్యం. ఒకటిరెండేళ్లు జరిగాక గదా - మనం చదువుబాగా చెప్పేదీ లేనిదీ ప్రజలకు తెలిశేది? అంతవరకూ యిలా వుండకతప్పదు" అని వివరించాడు.

వ్యక్తిగత భావాలు ఆచరణలో పెట్టే వీలులేనందున గొప్ప గొప్ప వుద్యోగాలకే రాజీనామా లిచ్చినపున్నయ్య - వెధవ నలభైరూపాయిల పంతులు పని నిలబెట్టుకునేందుకింత హీనుడైపోతున్నాడని తెలిశేసరికి గంగయ్య ఎంతో ఆశ్చర్యపోయాడు. ఇంతకీ - తానొచ్చినపని మాచుకుపోవాలనే తొందరలో "మీనాయనమ్మ దినానికి రాకుండా వుండడానికి నీ మనసెలా ఒప్పిందిరా?" అని అడగాడు. పున్నయ్య "నామనసెంత బాధపడిందో చెప్పి మిమ్మల్ని నమ్మించలేను. అంత వేదనే వుంటే కర్మాదులకు రాడా అనీ అంటారు...

"నేను మా అమ్మను చూసి సంవత్సరం దాటింది. ఇక మిగతా బంధువులసంగతి చెప్పనక్కర్లేదు. పట్నంలో వుద్యోగం మాని ఆరునెల్లయింది. ఇంతవరకూ మా వాళ్లెవరికీ కూడా యీ సంగతి గాని, యీ వూరిలా వచ్చివుంటున్నానని గాని తెలవదు..."నీళ్ళు నిండిన కళ్ళతో నేల చూస్తూ చెబుతున్నాడు.

గంగయ్య "అదేమిట్రా? ఒక్క కార్డు ముక్కన్నా వెయ్యలేదట్రా నువ్వు?"అని ఆశ్చర్యంగా అడిగాడు. పున్నయ్య తల

(56-వ పేజీ చూడండి)



# నీచాతి నీచుడు

(11-వ పేజీ తరువాయి)

తకుండానే - "లేదు ఉత్తరం ఏముఖంతో రాయను? ఏమని వ్రాయను? నేనిక్కడేం మహాకార్యం వెలగబెడుతున్నానని తెలియజెయ్యను నేనుత్తరం వ్రాయడంవల్ల నాతల్లిగ్గాని, మరొకరిగ్గాని నింపేదేమిటి? ఆ ఉత్తరం చూచిన దగ్గర్నుంచీ - నన్నూ, నా అసమర్థతనీ వెయ్యిసార్లు తిట్టి - తమరక్తంలో భాగం యిలా నీచుడై పోయాడని కడుపు చెరువుచేసుకోవడమేగా ఫలితం? ఒకళ్ళకింత పెట్టలేక పోగా - దుఃఖపెట్టడం దేనికి?" అన్నాడు - ఎంతో కసికే పెదేలు కరుచుకుంటూ

గంగయ్య "అయితే - యిక అయిన వాళ్ళకి ఉత్తరమూ వెయ్యక, వాళ్ళ చూడక పోతే ఎలాగురా? మానవ సంబంధాలింతేనా?" అని గద్దించాడు పున్నయ్య "మానవత్వం!? నాలోనూ మానవత్వమున్నదని ఎలా రుజూచేసుకోను రక్త సంబంధీకులకు కష్టంవచ్చినప్పుడు తృణమాత్రమైనా ఆదుకునేశక్తి నాకేది? ఏనాటికైనా నా తెలివితేటలు నాస్థితిని బాగుపరుస్తాయనీ; ఆనాడైనా తగినంత సంపాదించుకుంటూ నే హోననీ; అప్పుడుగాని నాలోని మానవత్వం రుజూగాదనీ అనుకుంటున్నాను" అని నూతిలో మనిషిలా చెప్పాడు,

గంగయ్య "ఏవేవో ఆర్థిక సిద్ధాంతాలతో సాకులు వెదుకుతున్నావుగాని— ఒక్కసారి వెళ్ళి తల్లినీ, అన్ననూ చూచి రావాలంటే రెండురూపాయలు ఖర్చుపెట్టలేవట్రా? వాళ్ళైనా నిన్ను పెట్టమనీ పొయ్యమనీ రొక్కించేవాళ్ళు కాదయ్యే. ఈ నాయనమ్మ దినానికైనా వెళితే నలుగుర్లోనూ మాట దక్కేదిగా" అని చివాట్లు ధోరణిలో అన్నాడు పున్నయ్య కన్నీళ్లు తుడుచుకుని "రెండుగాదు, అయిదు ఖర్చు పెట్టుకుని వెళ్తాను కాని లాభం ఏమిటి? అయిదారేళ్లనుంచీ తల్లికి కానీ యివ్వని నన్ను ఎవరు మెచ్చుకుంటారు? ఎందుగ్గాను ఎవరూ తిట్టకుండా వుండగల్రు? ఇన్ని ఉద్యోగాలుచేసి అర్ధాంతరాన వదులుకుని కుటుంబంతో కష్టాలు పడుతున్నందుకూడా - నన్ను వెకిలి వెధవాయనీ, రాలుగాయనీ, మదమెక్కిన మూర్ఖుడనీ తిట్టకుండా వుంటారుగా? కులం చెడబుట్టాననికూడా ఎన్నోసార్లన్నారు.

మళ్ళా యీ సవాలక్ష తిట్లూ తినేందుకేగా నే వెళ్ళవలసింది?

"తిట్లు తింటే వచ్చిన నష్టంకూడా లేదు యిన్నీ సహించడానికి సిద్ధపడివున్నాను - వుండక చేసేదీలేదు కాని, యిన్నీ ఎరిగుండి కూడా నే వెళతానే అనుకోండి అందువల్ల జరిగే కర్మాదికాలు యింకా విజయవంతమౌతాయా, యింకా ఎక్కువ మంది తృప్తిపడతారా, యింకా ఏమైనా ప్రయోజనంవుందా? ఏమీలేదు నే వెళ్లినా వెళ్ళకపోయినా ఒకటే. పైగా నే వెళ్లాక - నన్ను చూచినంతనే మనసులోవున్న కోపాన్నీ, వేదనల్నీ అగ్నిపర్వతాల్లా బద్దలు చేసేవాళ్ళుకూడా వున్నారు నే కనిపించడంవల్ల వాళ్లకి వేదనమీరడంతప్ప - మరే ప్రయోజనమూ లేదు ఇవన్నీ తెలిసుండి కూడా నేనెలా వెళ్ళేది??" అని తెల్లముఖంతో ప్రశ్నించాడు.

గంగయ్య చొక్కా గుండీలు సరిజేసుకుని "అయినా - తల్లిని యింతకాలం చూడకుండా ఎలా వున్నావురా?" అంటూ లేచాడు. పున్నయ్య "వుండక చెయ్యగలిగేదేమిటి? దైనికావసరాలకే చాలని జీతం... వెనకాముందూ చూచేవాళ్లులేరు. కొడుక్కి చొక్కా కుట్టించాలంటే నెలరోజులు నెయ్యి మానుకోవాల్సిన స్థితి ఇలాంటి హీనుణ్ణి - ఏ విధంగా వంశమమకారం, గౌరవ ప్రపత్తులూ చూపగల్ను? నలుగురకూ కనిపించే మంచిపని - నాబోటి వాళ్ళకెలా సాధ్యం??" అంటూ ముక్కు చీదేశాడు

* * *

వారం రోజుల తర్వాత పున్నయ్యకో ఉత్తరం వచ్చింది అందులో - " ఆ నీచపు వెధవింటి కెందుకెళ్ళావ్? - ఆ దుర్మార్గుడింట్లో ఎలా భోంచేశావ్?? నీబోటి వాళ్ళని కూడా బోయ్ కాట్ చెయ్యాలి బంధుమిత్రులందరూ. ఇలా లక్షమాట లన్నాడు మీ మేనమామ - నన్ను " అని వ్రాశాడు గంగయ్య ★

# కాలక్షేపం

(5-వ పేజీ తరువాయి)

చూపించండని నవాబు కొడుకులు జవాబు చెప్పారు అప్పుడుభరిణలోతొమ్మిదేండ్లుగా దాచిన పాతనవాబు గడ్డంలోని వెంట్రుకను తీసి కొడుకుల ముందు పెట్టి "యిదే వారి పవిత్ర ప్రమాణాధారం" అన్నాడు

తమ తండ్రిగారి గడ్డంలోని వెంట్రుకను అంతగౌరవంగా దాచియుంచిన ఆ భూసురోత్తమునకు భూరివిరాళి మిచ్చి తమ గురుభావం పూర్తిగా చూపించారు

ఆ నవాబు కొడుకులు ఆ బ్రాహ్మణుని దగ్గర అసత్యంలేదని గ్రహించారు నవాబు మాట అసత్యం కాదని ఆ బ్రాహ్మణుడు విశ్వసించాడు ఈవిధమైన పరస్పర సత్య విశ్వాసంతోనే ప్రభువులు ప్రవర్తించాలి అని సత్య హరిశ్చంద్రుని కాలంలో విశ్వామిత్రుడు బోధించాడు సత్యమును, అహింసను మరొకసారి ప్రభుత్వాధిపతులకూ ప్రజలకూ బోధించడానికి మహాత్ముడు అవతరించాడు అటువంటి మహాత్ముడు అవతరించి సిద్ధిపొందిన యీ భారతదేశానికి ప్రపంచంలోని ఏ దేశంనుంచి ఎంత గొప్పవాడు వచ్చినప్పటికీ ఢిల్లీలో దిగి నమస్కరించవలసిన పుణ్యక్షేత్రము రాజఘాటులోని మహాత్ముని సమాధి ఈకాలంలో నృపతులకు లేని గౌరవం యతులకుఉంది. మహారాజులకు లేని గౌరవం మహాత్ములకు ఉంది

యతుల విభూతిదాల్చిన భారతభూమిలో ప్రజాహృదయమును పరిపాలించేది మహాత్ముడేగాని మహారాజుకాడు అందువల్లనే-

"వినయము సేయ వేని పృథివీవర
సాగద మీ తుఱంబునన్"

అని యతీంద్రుడు రాజేంద్రుణ్ణి యీ భరత ఖండంలో ధిక్కరించగలడు ఇది యతిరాజుల రాజ్యంగాని రాజుల రాజ్యం కాదు ఈదేశంలో రాజుకు యతిరాజుకు ఆర్థికసమత్వం ఉండనక్కరలేదు ఆధ్యాత్మిక సంబంధ సమాన ప్రతిపత్తీ, సమత్వమూ కావాలి మన సామ్యవాదం ఇది. ఈ పారమార్థిక సామ్యవాదంలో ఆర్థిక సామ్యవాదం జీర్ణించి అంతర్గతంగా ఉంది. ధనికవాదాన్ని భారతదేశం ఏనాడో ఖండించి, "ధనపతివీవు, మేము వివిధ శ్రుతి పుంజ పదార్థతత్వకాసనులము;—" అనే మాట శాసనప్రమాణం చేసి, చలామణీ చేసింది ★

Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras